సాక్షి తూర్పుగోదావరి

బుధవారం | 31 | జూలై | 2024



నిత్యాన్నదానానికి రూ.20,232


అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి త్సామ వెంకట సుబ్రహ్మణ్యం (కొత్తపేట) రూ.10,116, తెలికపల్లి ఆశిష్ కాశ్యప్ (హైదరాబాద్) రూ.10,116 విరాళంగా అందజేశారు.



అన్నదాన భవనానికి రూ.లక్ష

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి దాడిశెట్టి విష్ణుచక్రం దంపతులు (తుని మండలం ఎస్.అన్నవరం) రూ.1,00,500 విరాళం సమర్పించారు.

డెల్టాలకు 7,200 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 7,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,500 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1,200 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 2,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

4 నుంచి ఉచిత హోమియో వైద్య శిక్షణ

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): స్థానిక గోదావరి గట్టున ఉన్న జగద్గురు పీఠంలో వచ్చే నెల నాలుగో తేదీ నుంచి హోమియో ప్రాథమిక వైద్య శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. వచ్చే ఏడాది మే నెల వరకూ సుమారు 50 వారాల పాటు ఈ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రోజైన వచ్చే ఆదివారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ.. ఆ తర్వాత ప్రతి ఆదివారం ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకూ ఈ తరగతులు నిర్వహిస్తారు. ఇతర కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు ఈ శిక్షణకు అనర్హులు. ఈ శిక్షణకు 25 నుంచి 50 సంవత్సరలోపు వారు అర్హులు. అర్హత, అభిరుచులను బట్టి శిక్షణకు ఎంపిక చేస్తారు. శిక్షణ ఉచితంగా ఇస్తారు. జిరాక్స్‌లు, నోట్ బుక్‌ల నిమిత్తం రూ.1,000 చెల్లించాలి. నాలుగు నెలల అనంతరం ప్రతి శిక్షణ తరగతి తర్వాత రెండు గంటల పాటు జగద్గురు పీఠంలోని హోమియో వైద్యాలయంలో వైద్య ప్రక్రియ నేర్చుకోవాలి. ప్రతి నెలా చివరిలో ఆ నెలలో నేర్చుకున్న అంశాలపై పరీక్ష నిర్వహిస్తారు. 80 శాతం హాజరు కలిగి, చివరిలో నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు ఇస్తారు. పూర్తి వివరాలకు జగద్గురు పీఠాన్ని 98663 26043, 94402 95824 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ప్రశాంతంగా డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

రాజమహేంద్రవరం సిటీ: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఆర్‌ఓ జి.నరసింహులు తెలిపారు. లూథర్‌గిరిలోని అయాన్ డిజిటల్ జోన్‌లో పరీక్షల తీరును మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉదయం పరీక్షకు 241 మంది దరఖాస్తు చేసుకోగా 208 మంది హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం సెషన్‌లో 211 మందికి గాను 177 మంది రాశారన్నారు. అలాగే బుధవారం ఉదయం 577 మంది ఉద్యోగులు ఈ పరీక్షలకు హాజరవుతారని తెలిపారు.

25న జాంపేట అర్బన్ బ్యాంక్ ఎన్నికలు

రాజమహేంద్రవరం సిటీ: ది జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకవర్గం ఎన్నికలు వచ్చే నెల 25న నిర్వహిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆగస్టు 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామనని, బ్యాంకు నియమాలను అనుసరించి జూన్ 8వ తేదీ, అంతకు ముందు బ్యాంకులో చేరిన ఖాతాదారులు ఓటు వేయడానికి అర్హులన్నారు. అలాగే జూలై 8 నాటికి వాయిదా మీరిన బకాయిదారులు ఓటు వేయడానికి అనర్హులని ప్రకటించారు. జాంపేట మెయిన్, మోరంపూడి, ధవళేశ్వరం, సీతంపేట, అనపర్తి, పెద్దాపురం, కాకినాడ, గోకవరం, ఏలూరు, కొవ్వూరు బ్రాంచ్‌లలో ప్రాథమిక ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచామని వివరించారు. ఆగస్టు 2న ప్రాథమిక ఓటర్ల జాబితా ప్రకటిస్తామన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ జి.నరసింహులు, జాంపేట బ్యాంక్ కార్యదర్శి, సీఈఓ మద్దాల విజయ ప్రతాప్, డీసీఓ డి.శ్రీరాములు నాయుడు, ఎన్నికల అధికారి ఎం.జనార్దనరెడ్డి పాల్గొన్నారు.

ఇదీ షెడ్యూల్

నోటిఫికేషన్ విడుదల : ఆగస్టు 9

నామినేషన్ల స్వీకరణ : 16వ తేదీ ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ. అనంతరం అభ్యర్థుల జాబితా ప్రకటన.

నామినేషన్ల పరిశీలన : ఆగస్టు 17

ఉపసంహరణకు గడువు : 18వ తేదీ ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ. అనంతరం అభ్యర్థుల తుది జాబితా, గుర్తులు, ఏకగ్రీవం వివరాల ప్రకటన.

పోలింగ్: 25వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ.

ఓట్ల లెక్కింపు : 26వ తేదీ ఉదయం 8 నుంచి. అనంతరం ఫలితాల ప్రకటన.

కో ఆప్షన్ సభ్యుల భర్తీ : 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: సహకార సంఘాలను బలోపేతం చేసి, వాటి ద్వారా కార్యకలాపాలను సమర్థంగా నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ (డీసీడీసీ) సమావేశంలో ఆమె మాట్లాడారు. సహకార రంగాన్ని పటిష్టపరచడంలో ఉత్పత్తి, మార్కెటింగ్ సామర్థ్యం పెంపు అత్యంత కీలకమన్నారు. వ్యవసాయం, హార్టికల్చర్, ఫిషరీస్, మార్కెటింగ్ విభాగాల ఆధ్వర్యంలో ఎఫ్‌పీఓలు ఏర్పాటు చేయడం ద్వారా సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయడం సాధ్యమవుతుందని తెలిపారు. ఒక్కో ఎఫ్‌పీఓ కనీసం 300 మంది సభ్యులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.

సాధారణం



రాజమండ్రి స్టేషన్‌లో ఆగిన విశాఖ ఎక్స్‌ప్రెస్



జనరల్ బోగీ వద్ద ప్రయాణికుల రద్దీ

- రైళ్లలో తగ్గిపోయిన జనరల్ బోగీలు
- కష్టంగా మారిన సామాన్యుల ప్రయాణం
- ఎక్స్‌ప్రెస్ రైళ్లలో చాలీచాలని జనరల్ బోగీలు
- అవి కూడా కిటకిట
- 'సాక్షి' పరిశీలన

సాక్షి, రాజమహేంద్రవరం/రాజమహేంద్రవరం సిటీ: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో విజయవాడ తరువాత అతి పెద్ద రైల్వే స్టేషన్ రాజమహేంద్రవరం. ఇక్కడి నుంచి ప్రతి రోజూ 110 రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిల్లో 30 వేల మంది ప్రతి రోజూ వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తూంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రైల్వే స్టేషన్ నుంచి అప్పటికప్పుడు రైలు ప్రయాణం చేయాలంటే జిల్లాలోని సాధారణ ప్రయాణికులు హడలెత్తుతున్నారు. రైలు ఎక్కాలంటే నెల, రెండు నెలల ముందే రిజర్వేషన్ చేయించుకోవాలి. అదీ కుదరకపోతే రెండింతల చార్జీ భరించి ప్రీమియం తత్కాల్ అయినా చేయించుకోవాలి. ఇదంతా అయ్యే పని కాదనుకుంటే అధిక చార్జీలతో ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించాల్సిన దుస్థితిని అత్యవసర, సామాన్య ప్రయాణికులు ఎదుర్కొంటున్నారు. రైల్వే స్టేషన్‌లో సాధారణ ప్రయాణికుల ఇబ్బందులపై 'సాక్షి' మంగళవారం పరిశీలన జరిపింది.



విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో జనరల్ బోగీ ఎక్కేందుకు ప్రయాణికుల ఇక్కట్లు

'విశాఖ'లో ఆపసోపాలు

భువనేశ్వర్ – సికింద్రాబాద్ (17015) విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో ఎక్కేందుకు ప్రయాణికులు పడుతున్న ఇక్కట్లను 'సాక్షి' పరిశీలించింది. ఈ రైలు మొత్తం 1,134 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. ఇంత సుదీర్ఘ దూరం ప్రయాణించే ఈ రైలులో జనరల్ బోగీలు ఒకటి పూర్తిగా, మరొకటి సగం అంటే.. ఒకటిన్నర మాత్రమే ఉన్నాయి. రాత్రి 8 గంటలకు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు వచ్చింది. అప్పటికే వందలాది మంది ప్రయాణికులు ప్లాట్‌ఫాంపై వేచి ఉన్నారు. విశాఖ ఎక్స్‌ప్రెస్ రాగానే ఒక్కసారిగా అనేక మంది జనరల్ బోగీలోకి ఎక్కేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. అప్పటికే బోగీ కిక్కిరిసి ఉంది. కాలు పెట్టేందుకు సైతం స్థలం లేదు. వంద మంది ప్రయాణించాల్సిన జనరల్ బోగీలో 500 మంది పైనా వెళ్తున్న పరిస్థితి. అయినప్పటికీ తప్పని పరిస్థితుల్లో గమ్యం చేరేందుకు అతి కష్టం మీద జనరల్ బోగీలోకి ప్రయాణికులు నానా అగచాట్లూ పడి ఎక్కారు. గత్యంతరం లేక ఖాళీ చేసుకున్న చోట, బాత్‌రూముల మధ్య నిలబడి ప్రయాణానికి సిద్ధపడ్డారు. చిన్నారులు, మహిళల కష్టాలు చెప్పనలవి కాదు. ఇంత ప్రాధాన్యం ఉన్న ఈ రైలులో ఒకటిన్నర జనరల్ బోగీలు మాత్రమే ఉండటమేమిటని ప్రయాణికులు ఆవేదన చెందారు. కాసుల వర్షం కురిపించే ఏసీ బోగీలను పెంచిన అధికారులు జనరల్ బోగీల పెంపుపై దృష్టి సారించడం లేదు.

ఇతర రైళ్లలోనూ అంతే..

ఇతర రైళ్లలో సైతం ఈ పరిస్థితి నిత్య కృత్యమవుతున్నా రైల్వే అధికారులు కనీసంగా కూడా స్పందించటం లేదు. ఫుట్‌పాత్‌పై నిలబడి ప్రమాదం అంచున సాధారణ ప్రయాణికులు ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ప్రయాణంలో బాత్‌రూముకు వెళ్లడానికి సైతం వెళ్లే అవకాశం లేకుండా ప్రయాణించాల్సిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. ఏడాది క్రితం విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో మూడు జనరల్ బోగీలు ఉండేవి. సుమారు 240 మంది కూర్చుని ప్రయాణించేందుకు అవకాశం ఉండేది. అప్పట్లోనే సాధారణ ప్రయాణికులు అధిక సంఖ్యలో ప్రయాణిస్తూ తీవ్ర అవస్థలకు గురయ్యే వారు. ఇప్పుడు వాటిని రైల్వే అధికారులు సగానికి తగ్గించేయడంతో ఇక్కట్లు రెట్టింపయ్యాయి. ప్రస్తుతం జనరల్ బోగీలు తగ్గించేయడంతో కూర్చునే పరిస్థితి పక్కన పెడితే నిలబడటానికి సైతం ఖాళీ లేని దుస్థితి నెలకొంటోంది. రైళ్లలో జనరల్ బోగీలను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వడి వీడుతూ..



కాటన్ బ్యారేజీ వద్ద కడలి దిశగా గోదావరి పరుగులు

- తగ్గుతున్న గోదావరి వరద
- రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- నేడు మరింత తగ్గే అవకాశం

ధవళేశ్వరం: కొద్ది రోజులోగా ఉగ్రరూపం దాల్చిన గోదావరి వడి క్రమంగా తగ్గుతోంది. కాటన్ బ్యారేజీ వద్ద వరద ఉధృతి మంగళవారం మరింత తగ్గింది. బ్యారేజీ వద్ద నీటిమట్టం ఉదయం 6 గంటలకు 13.70 అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. అనంతరం ప్రవాహం మరింత తగ్గుతూ రాత్రి 7 గంటలకు నీటిమట్టం 12.60 అడుగులకు చేరింది. బ్యారేజీ నుంచి 11,19,425 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక అమలులో ఉంది. గోదావరి వరద ఉధృతి బుధవారం మరింత తగ్గే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మంగళవారం రాత్రి 7 గంటలకు 43.60 అడుగులుగా ఉంది.

ఎగువన గోదావరి నీటిమట్టాలు (మీటర్లలో)

కాళేశ్వరం	11.04
పేరూరు	15.99
దుమ్ముగూడెం	11.76
కూనవరం	19.18
కుంట	10.54
కొయిదా	25.23
పోలవరం	12.59
రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి	16.31

రాష్ట్రంలో అరాచక పాలన

- హామీలు ఇచ్చినప్పుడు రాష్ట్ర బడ్జెట్, ఆర్థిక పరిస్థితి తెలీదా?
- కూటమి ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ధ్వజం



చాగల్లు: రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ హత్యలు, దౌర్జన్య కాండలు, విధ్వంసాలు చూస్తుంటే అరాచక పాలన సాగుతున్నట్లు అనిపిస్తోందని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్చార్జి, గోపాలపురం మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ధ్వజమెత్తారు. చాగల్లులో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా, మరో మూడు నెలలకు ఓటాన్ అకౌంట్‌కు వెళ్లిందన్నారు. రాష్ట్రం మొత్తం బడ్జెట్ ఎంత, ఆదాయ వ్యయాలు ఎంత, రాష్ట్రానికి ఉన్న రుణాలు ఎంత, ఏయే శాఖలకు ఎంత కేటాయించాలి, ఏయే పథకాలకు ఎంత ఖర్చు చేయాలనే వివరాలు చెప్పాల్సి వస్తుందనే చంద్రబాబు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఎత్తుగడ వేశారని అన్నారు. శ్వేతపత్రాల పేరుతో కాలయాపన చేస్తూ పథకాలను ఎగ్గొట్టే దిశగా చంద్రబాబు పావులు కదుపుతున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, అధికారం చేపట్టిన తర్వాత వాటిని విస్మరించడం ఆయనకు అలవాటేనన్నారు. హామీలు ఇచ్చినప్పుడు రాష్ట్ర బడ్జెట్, ఆర్థిక పరిస్థితి తెలీదా అని ప్రశ్నించారు. హామీలు అమలు చేయకపోగా మరోవైపు నుంచి రెడ్‌బుక్ రాజ్యాంగం నడుపుతూ వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు ఎగబడుతున్నారని ధ్వజమెత్తారు.

అప్పులపై అబద్ధాలు

ఎన్నికలకు ముందు రాష్ట్రానికి రూ.14 లక్షల కోట్ల అప్పులున్నాయంటూ ఊదరగొట్టిన చంద్రబాబు.. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రూ.10 లక్షల కోట్లకు మార్చి అసెంబ్లీ సాక్షిగా గవర్నర్‌తో అబద్ధం కూడా చెప్పించారని వెంకట్రావు అన్నారు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టేసరికి రాష్ట్ర ఖజానాలో రూ.100 కోట్లు మాత్రమే ఉన్నాయని, అయినప్పటికీ తమ ప్రభుత్వం వారం రోజుల్లోనే పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో ఎటువంటి వివక్షా లేకుండా డీబీటీ ద్వారా అర్హులైన పేదలందరికీ రూ.2.71 లక్షల కోట్లు ఇచ్చామన్నారు. లబ్ధి పొందిన వారిలో టీడీపీ నేతలు, కార్యకర్తలు కూడా ఉన్నారని చెప్పారు.

పోలవరంపై లాలూచీ

న్యాయబద్ధంగా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది కాగా, కమీషన్ల కక్కుర్తితో 2013–14లో రూ.20,398 కోట్లకే నిర్మిస్తామని అప్పటి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో చంద్రబాబు లాలూచీ పడింది నిజం కాదా అని వెంకట్రావు ప్రశ్నించారు. ఇదే అంశంపై అప్పట్లో ప్రధాని మోదీ సైతం పోలవరం ప్రాజెక్ట్ చంద్రబాబుకు ఏటీఎం లాంటిదంటూ ఎద్దేవా చేశారని గుర్తు చేశారు. అస్మదీయ కంపెనీలకు నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులిచ్చి నిధులు దోచుకుని ప్రాజెక్ట్ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. 2014–19 మధ్య ఇసుక విధానంపై టీడీపీ ప్రభుత్వం 19 జీఓలు తెచ్చి, భారీ దోపిడీకి పాల్పడిందనే విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. తాజాగా ఉచిత ఇసుక పేరుతో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఏకమై సొంత ఖజానాలు నింపుకొంటున్నారని అన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా నెరవేర్చలేని దుస్థితిలో చంద్రబాబు సర్కారు ఉందన్నారు. ఇప్పటికైనా గత ప్రభుత్వ చిత్తశుద్ధిపై నిందలు వేయడం మాని, ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని చంద్రబాబు ప్రభుత్వానికి వెంకట్రావు హితవు పలికారు.

నిర్లక్ష్యానికి చెల్లించక తప్పదు.. భారీ మూల్యం



- సరైన భద్రత లేకుండా భారీ నగదు లావాదేవీలు
- నిబంధనలు పాటించకుండానే కస్టోడియన్ల నియామకం
- చదువు, నైతిక ప్రవర్తనతో సంబంధమే లేదు
- ఉద్యోగుల గత చరితనూ పట్టించుకోని వైనం
- ఏటీఎంలలో నగదు నింపే సంస్థల నిర్వాకం
- ఫలితంగానే భారీగా నగదు చోరీకి ఆస్కారం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కనీస భద్రత ఉండదు.. బాధ్యత గల ఉద్యోగులు ఉండరు.. కానీ కోట్లాది రూపాయల లావాదేవీలు మాత్రం అవలీలగా జరిగిపోతూంటాయి. తీరా తేడా వచ్చాక చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నాయి జిల్లాలోని ఏటీఎం నిర్వాహక సంస్థలు, భారీ నగదు లావాదేవీలు నిర్వహించే కొన్ని వ్యాపార సంస్థలు. రాజమహేంద్రవరం నగరంలో రెండు రోజుల క్రితం జరిగిన రూ.2.20 కోట్ల చోరీ ఏటీఎం నిర్వాహక సంస్థల బాధ్యతారాహిత్యాన్ని, నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతోంది. భారీ నగదు లావాదేవీల్లో అనుసరిస్తున్న పంథాను మార్చుకోవలసిన అవసరాన్ని, మరిన్ని జాగ్రత్తలు తీసుకోవలసిన ఆవశ్యకతను తెలియజేస్తోంది.

నిర్లక్ష్యంగా లావాదేవీలు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఏటీఎంలలో నగదు నింపే పనిని హిటాచీ క్యాష్ మేనేజ్‌మెంట్ సంస్థ నిర్వహిస్తోంది. రాజమహేంద్రవరంలోని ఆ సంస్థ ఉద్యోగులు రోజూలానే ఈ నెల 26న స్థానిక దానవాయిపేటలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు వచ్చారు. వారిలో వాసంశెట్టి అశోక్‌కుమార్ అనే ఉద్యోగి కస్టోడియన్‌గా వ్యవహరిస్తాడు. ఏటీఎంలలో నగదు నింపేందుకు అవసరమైన రూ.3.5 కోట్ల మొత్తాన్ని బ్యాంకు నుంచి అతడు తీసుకున్నాడు. అతడితో వచ్చిన మరో కస్టోడియన్, మరో ఇద్దరు సెక్యూరిటీ సిబ్బంది కలిసి ఒక వ్యాన్‌లో ఏటీఎంల వద్దకు వెళ్లి నగదు నింపారు. తిరిగి మరికొంత నగదు తీసుకునేందుకు మధ్యాహ్నం బ్యాంకుకు వచ్చారు. అశోక్ కుమార్ ఇచ్చిన చెక్కు ప్రకారం బ్యాంకు సిబ్బంది రూ.2.20 కోట్ల నగదు అతడికి ఇచ్చారు. బ్యాంకు ఆవరణలోనే ఆ నగదును సర్దుతున్నట్లు అశోక్ నటించాడు. ఈ క్రమంలో ముందుగా వేసుకున్న పథకం ప్రకారం తాను తెచ్చుకున్న కారులో ఆ నగదుతో పరారయ్యాడు. లోపలకు వెళ్లిన అశోక్ ఎంతకూ బయటకు రాకపోవడంతో బయట వ్యాన్ వద్ద వేచి చూస్తున్న మిగిలిన సిబ్బంది కొద్ది సమయానికి అప్రమత్తమై, అతడి కోసం వెతికారు. బ్యాంకులో కనిపించకపోవడంతో విషయాన్ని సంస్థ నిర్వాహకులకు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు రాజమహేంద్రవరం వన్‌టౌన్ పోలీసులు రంగంలోకి దిగి, దర్యాప్తు చేసి, నిందితుడిని గంటల వ్యవధిలోనే అరెస్టు చేసి నగదు రికవరీ చేశారు.



ఏటీఎంలకు నగదు తరలించే వ్యాన్

ఏ ష్యూరిటీ లేకుండానే..

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నగదు చోరీ కేసు దర్యాప్తులో పోలీసులు విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. నిత్యం కోట్లాది రూపాయలు లావాదేవీలు జరిపే వాసంశెట్టి అశోక్‌ను తాత్కాలిక ప్రాతిపాదికన హిటాచీ సంస్థలో నియమించారు. ఇంటర్ మాత్రమే చదివిన అతడికి ఇస్తున్న జీతం రూ.11 వేలు మాత్రమే. పైగా ఎటువంటి ష్యూరిటీ లేకుండా అతడిని నియమించుకున్నారని తెలిసింది. అతడు గతంలో ఆకతాయిగా తిరిగేవాడని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. బ్యాంకులో నగదు డ్రా చేసే సమయంలో కస్టోడియన్ సిబ్బందిలో అశోక్ ఒక్కడే లోపలకు వెళ్లి నగదు తెచ్చాడని పోలీసులు గుర్తించారు. మరో కస్టోడియన్ వ్యక్తిగత పనులపై బయటకు వెళ్లారు. దీంతో అశోక్‌కు నేరం చేయడం సులువైంది. ఇటువంటి సందర్భాల్లో బ్యాంకు అధికారులు సైతం కచ్చితంగా వ్యవహరించాల్సి ఉంది. ఎంత పరిచయమైన వ్యక్తి అయినా నిబంధనల మేరకు వ్యవహరిస్తే నేరం జరిగే అవకాశం ఉండదని పోలీసులు చెబుతున్నారు.

ఇష్టారాజ్యంగా ఉద్యోగుల నియామకం

నిబంధనల ప్రకారం ఏటీఎం నగదు నిర్వాహక సంస్థలు బ్యాంకు నగదు తీసుకువచ్చే సందర్భాల్లోను, ఏటీఎంలలో నింపే సమయంలోను ఇద్దరు కస్టోడియన్లు, ఇద్దరు సెక్యూరిటీ సిబ్బంది తప్పనిసరిగా ఉండాలి. భారీ స్థాయిలో నగదు లావాదేవీలు జరిపే ఇటువంటి సంస్థల్లో కనీస విద్యార్హతతో పాటు మంచి నడవడిక ఉన్న వారిని ఉద్యోగులుగా నియమించుకోవాలి. కానీ చాలా సంస్థలు కనీస నిబంధనలు కూడా పాటించడం లేదు. తక్కువ జీతానికి వస్తున్నారని ఆకతాయిలను సైతం ఇటువంటి ఉద్యోగాల్లో నియమించేస్తున్నారు. దీంతో అప్పుడప్పుడు తగిన మూల్యం చెల్లించుకుంటున్నారు.

దశాబ్దం కిందట.. హత్య.. దోపిడీ

ఏటీఎం నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా హత్య, రూ.7 కోట్ల దోపిడీ ఘటన రాజమహేంద్రవరంలో 2013లో జరిగింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన ఏటీఎంల నిర్వాహక సంస్థకు సంబంధించి స్థానిక జయకృష్ణపురంలో కార్యాలయం ఉండేది. అక్కడ ఆ సంస్థ ఉద్యోగిని అక్కడి సిబ్బందే హతమార్చి, రూ.7 కోట్లు దోపిడీ చేశారు. ఈ ఘటనలో కూడా పోలీసు దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. ఆ సంస్థ ఉద్యోగుల్లో కూడా కేవలం 10వ తరగతి పాసైన వారే ఎక్కువ మంది ఉన్నారు. వారిలో కొందరికి నేర చరిత్ర కూడా ఉందని పోలీసులు గుర్తించారు. విధుల్లో భాగంగా వారు నిత్యం స్టేట్ బ్యాంక్ నుంచి ఏటీఎంలలో నింపేందుకు పెద్ద మొత్తంలో నగదు తీసుకుని వెళ్లేవారు. బ్యాంకు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొంత నింపి మిగిలిన సొమ్ములు జల్సాలు చేయడం చేసేవారు. ఆ మొత్తం రూ.7 కోట్ల వరకూ చేరడంతో చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు పథక రచన చేశారు. ఆ సొమ్ము దోపిడీ జరిగినట్టుగా చిత్రీకరించేందుకు తమతో పని చేసే సిబ్బందిలో ఒకరిని దారుణంగా హతమార్చి, పోలీసులను ఏమార్చే ప్రయత్నం చేశారు. లోతైన దర్యాప్తు అనంతరం పోలీసులు ఏటీఎం నిర్వాహక సంస్థ సిబ్బంది 12 మందిని అరెస్టు చేశారు. సుమారు రూ.4 కోట్ల వరకూ రికవరీ చేశారు. ఈ కేసు అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. ఏటీఎం నిర్వాహక సంస్థల్లో సిబ్బంది నియామకానికి విధి విధానాలు రూపొందించేందుకు కారణమైంది. అయినప్పటికీ చాలా బ్యాంకులు, సంస్థలు వాటిని ఇప్పటికీ పట్టించుకుంటున్న దాఖలాలు లేవని తాజాగా జరిగిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఉదంతంతో మరోసారి తేటతెల్లమైంది.

బాధ్యతతో వ్యవహరించాలి



"ఏటీఎం నిర్వాహక సంస్థలు, భారీ నగదు లావాదేవీలు చేసే వ్యాపార సంస్థలు బాధ్యతగా వ్యవహరించాలి. బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో నగదు డ్రా చేసే సమయంలో కనీసం ముగ్గురు లేదా నలుగురు ఉద్యోగులతో కూడిన బృందం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. కచ్చితంగా మంచి నడవడిక కలిగిన పర్మినెంటు ఉద్యోగులను నియమించుకోవాలి. నగదు తరలించే వాహనాల కదలికలు ఎప్పటికప్పుడు తెలిసేలా ఏర్పాట్లు చేసుకోవాలి. ముందే జాగ్రత్తలు తీసుకుంటే నేరం జరగకుండా నియంత్రించవచ్చు. ఏటీఎంలలో నగదు నింపే ఏజెన్సీలు నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగులను నియమించుకోవాలి."

– డి.నరసింహ కిశోర్, జిల్లా ఎస్పీ



2013లో సంచలనం రేపిన రూ.7 కోట్ల దోపిడీ కేసులో ఏటీఎం ఏజెన్సీ ఉద్యోగులను అరెస్టు చేసిన పోలీసులు (ఫైల్)

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


విద్యుదాఘాతంతో మృతి చెందిన పశ్చిమ బెంగాల్ యువకుడు సహిదుల్ షేక్

కరప: 132/11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు పనులు చేస్తుండగా పశ్చిమ బెంగాల్ యువకుడు సహిదుల్ షేక్(16) మృతిచెందిన ఘటన కరప మండలం అరట్లకట్ట సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన కథనం మేరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మాల్దా జిల్లా మహేష్ బతాని గ్రామం నుంచి సహిదుల్ హక్, జియాహుల్ హక్ మరికొంత మంది విద్యుత్‌శాఖకు సంబంధించి 132/11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు పనులు చేయడానికి వచ్చారు. అరట్లకట్ట సమీపంలో అక్కడక్కడా ఉన్న నాలుగు విద్యుత్ టవర్లలో రెండు టవర్లపై మంగళవారం ఒక్కొక్క టవర్‌పై ముగ్గురు వంతున పని ప్రారంభించారు. ఒక టవర్ నుంచి మరొక టవర్‌కు ఎర్త్ వైరు లాగుతుండగా అకస్మాత్తుగా విద్యుత్ ఇండక్షన్ రావడంతో టవర్‌పైనుంచి ఎర్త్‌వైరును కిందికి వదిలేశారు. అదే సమయంలో కింద పనిచేస్తున్న సహిదుల్ షేక్ పై అది పడింది. బురదనీటిలో ఉండటంవల్ల విద్యుదాఘాతం సంభవించి అతను మృతిచెందాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. మరొకతనికి తీవ్రగాయాలవ్వగా కాకినాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కరప ఎస్ఐ టి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముంపు.. అధిగమిస్తే సొంపు

- వరద నీటి నుంచి పంటలను సంరక్షించుకోవాలి
- కనీస జాగ్రత్తలు తీసుకుంటే ఉద్యాన పంటలకు మేలు
- కూరగాయల సాగుకు సస్యరక్షణ చర్యలు ముఖ్యం



వంగ తోటలో ఆశించిన మొవ్వు తొలుచు పురుగు తెగులు

అలమూరు: వర్షాకాలం సీజన్‌లో ఏటా గోదావరికి వరద పోటెత్తుతూ ఉంటుంది. వరద తీవ్రతను బట్టి ఉద్యాన పంటలు మునిగిపోతూ ఉంటాయి. ఉద్యాన పంటల్లోకి వరద ప్రవేశించిన వెంటనే కొద్దిరోజులకే వరద నీరు వెళ్లిపోతే ఆ భూముల్లో సారం పెరుగుతుంది. అదే వరద నీరు రోజుల తరబడి ఉంటే వాణిజ్య, కూరగాయ, పూలతోటలకు వివిధ రకాల తెగుళ్లు సోకడంతో పాటు మొక్కలు కుళ్లిపోయి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుంది. వరద తీవ్రత తగ్గిన వెంటనే రైతులు అప్రమత్తమై ఉద్యానశాఖ సూచనలు, సలహాల మేరకు నష్ట నివారణ చర్యలు తీసుకుంటే ఆ పరిస్థితిని అధిగమించవచ్చు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అత్యధికంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లాలోని అన్ని మండలాలు గోదావరి తీర ప్రాంతాలతో పాటు ప్రస్తుత తూర్పు గోదావరి జిలాల్లో లంక ప్రాంతాలైన సీతానగరం, రాజమహేంద్రవరం రూరల్, కడియం, కొవ్వూరు, నిడదవోలు తదితర మండలాల్లో సుమారు 3.75 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు జరుగుతోంది. అందులో 2.5 లక్షల వరకూ గోదావరి పాయలైన గౌతమీ, వశిష్ట, వైనతేయ నదీతీరాల వెంబడి ఉన్న గ్రామాల్లో రైతులు వివిధ రకాల ఉద్యాన పంటలను పండిస్తుంటారు. వరదల సమయంలో సాగు చేస్తున్న ఉద్యాన పంటలకు సమగ్రమైన సస్యరక్షణ, యాజమ్యాన పద్ధతులు అవలంబిస్తే పంటలు నష్టపోకుండా అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది.

రైతులు పాటించాల్సిన పద్ధతులు

- వరద నీటిలో చిక్కుకున్న కూరగాయ, వాణిజ్య, పూలతోటలకు సోకే వివిధ రకాల తెగుళ్లను సస్యరక్షణ చర్యల ద్వారా నివారించాలి.
- పంట భూముల్లోకి ప్రవేశించే వరద నీరు బయటకు పోయే విధంగా భూమి వాలును అనుసరించి పొలాల్లో అరడగు వెడల్పు గల కాలువలను ఏర్పాటు చేసుకోవాలి.
- వరద నీరు ఇంకిపోయిన తరువాత పూర్తిస్థాయిలో నేలను పొడిగా ఆరనివ్వాలి.


కూరగాయల తోటలో వరద నీరు పోయేందుకు ఏర్పాటు చేసిన కాలువ (పాత చిత్రం)

- వరద నీరు ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉంటే జింక్, పొటాష్, నత్రజని పోషకాలతో పాటు ఇనుము ధాతు లోపం ఏర్పడుతుంది.
- ఇనుము ధాతులోపం నివారణకు 0.2 శాతం ఫెర్రస్ సల్ఫేట్‌ను, పొటాష్, నత్రజని లోపాల నివారణకు 1.0 శాతం పొటాష్ నైట్రేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

దొండ సాగుపై ప్రత్యేక శ్రద్ధ

వరదల సమయంలో దొండ సాగు పట్ల ఉద్యాన రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. సాధారణంగా వరద నీరు నిల్వ ఉండటం వల్ల దొండ పాదుల్లో చల్లని వాతావరణం ఏర్పడుతుంది. దీనివల్ల ముఖ్యంగా బూజు తెగులు, బూడిద తెగులు ఆశించే ప్రమాదముంది. బూజు తెగులు నివారణకు మాంకోజెల్ లేదా మెటాలాక్సిల్ 2 మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. బూడిద తెగులు నివారణకు ట్రి డీమార్ఫ్ లేదా డైనోకాప్ ఒక మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కూరగాయ తోటల్లో తెగుళ్లు-నివారణ చర్యలు

- కూరగాయ తోటలకు వరదల సమయాల్లో సాధారణంగా సంభవించే రసం పీల్చే పురుగుల నివారణకు 2 మిల్లీలీటర్ల ఫిప్రోనిల్ లేదా ప్రొఫెనోపాస్ మందును, లేక 3.మిల్లీలీటర్ల ఇమిడాక్రోప్రిడ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- టమాట సాగులో తరచూ సంభవించే ఆకుముడత తెగులు నివారణకు టెబ్యుకోనజోల్ 2 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కాయ కుళ్లు తెగులు నివారణకు కాఫర్ ఆక్సి క్లోరైడ్ ఒక గ్రాము మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- వంగసాగును పట్టి పీడించే మొవ్వు కుళ్లు, కాండం తొలుచు పురుగు నివారణకు మూడు గ్రాముల కార్బరిల్ మందును లేదా 2 మిల్లీలీటర్ల ప్రొఫెనోపాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ఆకుమచ్చ తెగులు నివారణకు ఒక గ్రాము కార్బన్‌డైజమ్ లేదా రెండు గ్రాముల కార్బన్‌డైజమ్‌తో పాటు మాంకోజెబ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



వరదలు సంభవించే సమయంలో ఉద్యాన రైతులు ఆందోళన చెందకుండా సస్యరక్షణ చర్యలు చేపడితే కూరగాయల సాగుకు ఏవిధమైన నష్టం వాటిల్లదు. వరద తీవ్రత తగ్గిన వెంటనే ముంపునీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. వరదల ప్రభావంతో సంభవించే తెగుళ్ల నివారణకు సత్వరమే ఉద్యానశాఖను సంప్రదించాలి. – డీవీ రమణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి, అమలాపురం

ఉద్యాన రైతులకు అవగాహన



వరద ముంపునకు గురైన వాణిజ్య, కూరగాయ, పూలతోటలను సంరక్షించేందుకు వీలుగా తీసుకోవలసిన జాగ్రత్తలపై లంక గ్రామాల్లో విరివిగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తాం. వరదలు తగ్గుముఖం పట్టిన వెంటనే ఉద్యానశాఖ సూచనల మేరకు రైతులు నష్ట నివారణ చర్యలు చేపట్టాలి. – జి.కోటేశ్వరరావు, డివిజన్ ఉద్యానశాఖ అధికారి, కొత్తపేట

మద్యం తాగి బైక్ నడిపిన 22 మందికి జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసులో 22 మందికి రెండురోజులు జైలు శిక్ష, 26 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు మంగళవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే మద్యం సేవించి బైక్‌పై కాకినాడలో వివిధ ప్రాంతాలలో పలువురు వెళ్తుండగా ట్రాఫిక్ 1, 2 విభాగ సీఐలు ఎస్.రమేష్, చైతన్యకృష్ణ కేసులు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చగా 22 మందికి ఒక్కొక్కరికి రెండు రోజుల జైలు శిక్ష, 26 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మరో కోర్టులో...

మద్యం తాగి బైక్ నడిపిన కేసులో ఇద్దరికి రెండురోజులు జైలు శిక్ష, ఆరుగురికి జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్. వీరభద్రుడు మంగళవారం తీర్పు చెప్పారు. కాకినాడ వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో, తాళ్లరేవు మండలం కోరంగి పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం సేవించి బైక్‌పై వెళ్తుండగా పోలీసులు కేసులు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

జంప్ రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ


జంప్ రోప్ స్కిప్పింగ్ క్రీడల్లో తృతీయ స్థానంలో నిలిచిన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

అల్లవరం: నంద్యాలలో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి జంప్ రోప్ స్కిప్పింగ్ క్రీడల్లో అల్లవరం మండలం గోడి బాలురు గురుకులం విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. పోటీల్లో పాల్గొని పాఠశాలకు వచ్చిన ఎనిమిదో తరగతి విద్యార్థులు వీరభద్రరావు, సిద్ధార్థలకు గురుకులంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ఇబ్రహీం, పీడీ వి.నానిబాబు, పీఈటీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు విజేతలను అభినందించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం వెలికితీత


విజయకృష్ణ మృతదేహాన్ని వెలికితీస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

పి.గన్నవరం: ఊడిమూడిలంక వద్ద వైనతేయ నదిలో జరిగిన పడవ ప్రమాదంలో గల్లంతైన యువకుడు చదలవాడ విజయకృష్ణ (27) మృతదేహాన్ని పి.గన్నవరం అక్విడెక్టు వద్ద మంగళవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు వెలికితీశాయి. గత ఆదివారం ఉదయం మండలంలోని వరద ప్రభావిత లంక గ్రామాలకు ఉచ్చులవారిపేట ఏటిగట్టు నుంచి మంచినీటి ప్యాకెట్ల బస్తాలు తరలిస్తున్న పడవ అదుపు తప్పి బోల్తా పడిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో విజయకృష్ణ గల్లంతు కాగా, వరద ఉధృతిలో కొట్టుకుపోయిన మరో ఐదుగురిని రెండు పడవల్లో వెళ్లి రక్షించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ ప్రతినిధి టీహెచ్.బెటెన్ సింగ్ నేతృత్వంలో 24 మంది సిబ్బంది నాలుగు బోట్లతో గాలింపు చర్యలు నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. అక్విడెక్టు వద్ద మృతదేహాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, తహసీల్దార్ షేక్ హుస్సేన్, సీఐ ప్రశాంతకుమార్ పరిశీలించారు.

మోసం చేసిన వ్యక్తికి మూడేళ్ల జైలు

కాకినాడ లీగల్: వ్యాపారం కోసం బియ్యం తీసుకొని, చెల్లని చెక్కు ఇచ్చి మోసం చేసిన వ్యక్తికి మూడేళ్ల జైలు, రూ.10వేలు జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రసన్నలక్ష్మి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కాకినాడకు చెందిన కర్రి సూర్యనారాయణరెడ్డి వద్ద నుంచి రాజమహేంద్రవరానికి చెందిన వేలి జాన్ డేవిడ్‌రాజు అలియాస్ డేవిడ్‌రాజు వ్యాపార నిమిత్తం సుమారు 500 మెట్రిక్ టన్నుల బియ్యం 2012లో తీసుకున్నారు. బాకీ తీర్చేందుకు 2013లో రూ.ఒక కోటి 12 లక్షలకు ఐదు చెక్కులు ఇచ్చారు. వాటిని సూర్యనారాయణరెడ్డి బ్యాంక్‌లో వేయగా బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితులపై పోలీసులు మోసం కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో డేవిడ్‌రాజు పై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

- రాష్ట్ర స్థాయి, ఎన్‌ఎఫ్‌టీడబ్ల్యూ, ఫెలో టీచర్ కేటగిరీల్లో ఎంపిక
- ఆగస్టు 5వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం



రాయవరం: వివిధ ప్రభుత్వ యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ, ఎన్‌ఎఫ్‌టీడబ్ల్యు, ఫెలో టీచర్ కేటగిరీల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, డైట్, సాంఘిక, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు 2024 విద్యా సంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు వీలుంది. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులు కనీసం 15 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకుని ఉండాలి. ఏ విధమైన క్రమశిక్షణ చర్యలకు గురికానివారు, క్రిమినల్ కేసులు లేనివారు మాత్రమే అవార్డుకు అర్హులు. ఆగస్టు 5వ తేదీలోగా ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. మండల, డివిజన్ స్థాయిల్లో కమిటీలు ఉపాధ్యాయుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తాయి.

వివిధ స్థాయిల్లో కమిటీలు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు మండల స్థాయిలో ఎంఈవో చైర్మన్‌గా, ఎంఈవో-2 వైస్ చైర్మన్‌గా, సభ్యులుగా స్థానిక హెచ్‌ఎం, డైట్ లెక్చరర్/మండలానికి చెందని మరొక హెచ్‌ఎం సభ్యులుగా ఉంటారు. మండలంలోని ఎంఈవో పరిధిలోని ప్రాథమిక/ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయుల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో ఒకరిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు వారు పనితీరు ఆధారంగా మార్కులను కేటాయిస్తారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయుల జాబితాను ఎంఈవోలు జిల్లా విద్యాశాఖాధికారికి అందజేయాల్సి ఉంటుంది. డివిజనల్ స్థాయిలో డీవైఈవో చైర్మన్‌గా, మరో ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎంపిక చేయాల్సి ఉంటుంది.

జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, డీఈవో కన్వీనర్‌గా, డైట్ ప్రిన్సిపాల్, ఎమినెంట్ ఎడ్యుకేషనలిస్ట్, కలెక్టర్ ఎంపిక చేసిన మరో జిల్లా స్థాయి అధికారితో కమిటీ ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తుంది. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు కూడా జిల్లా నుంచి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తారు. అసంపూర్తిగా ఉన్న, ఫొటోలు లేని, ఆలస్యంగా సమర్పించే దరఖాస్తులు పరిశీలనలోనికి తీసుకోరు.

ముఖ్యమైన తేదీలు

- రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ఎన్‌ఎఫ్‌టీడబ్ల్యు, ఫెలో టీచర్ అవార్డుల దరఖాస్తులకు తుది గడువు: ఆగస్టు-5
- మండల స్థాయిలో దరఖాస్తుల స్క్రూటినీ: ఆగస్టు-6
- మండల స్థాయిలో దరఖాస్తులను డీఈవోకు అందజేయాల్సిన తుది గడువు: ఆగస్టు-7
- డివిజనల్ స్థాయిలో దరఖాస్తుల పరిశీలన, ఎంపికకు తది గడువు: ఆగస్టు-9
- డివిజనల్ స్థాయి దరఖాస్తులు డీఈవోకు సబ్మిషన్: ఆగస్టు-10
- జిల్లా స్థాయిలో దరఖాస్తుల పరిశీలన, ఫైనలైజేషన్: ఆగస్టు16
- జిల్లా స్థాయి నుంచి పాఠశాల విద్యాశాఖకు ఫైనల్ జాబితా సబ్మిషన్: ఆగస్టు-17
- రాష్ట్ర కమిటీ ఫైనల్ జాబితా ప్రకటన: ఆగస్టు-24

1. హైస్కూల్ హెచ్‌ఎం 2. స్కూల్ అసిస్టెంట్స్ ఇన్ హైస్కూల్స్ (అన్ని సబ్జెక్టులను కలిపి ఉపాధ్యాయుడు మాత్రమే). 3. ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎం 4. ప్రైమరీ, యూపీ స్కూల్స్‌లో ఎస్‌జీటీ 5. హైస్కూల్స్‌లో డ్రాయింగ్ టీచర్స్ 6. హైస్కూల్స్‌లో క్రాఫ్ట్ టీచర్స్ 7. హైస్కూల్స్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ 8. హైస్కూల్స్‌లో మ్యూజిక్ టీచర్స్.. తదితర 20 కేటగిరీల్లో దరఖాస్తులు చేసుకోవచ్చు.

మార్గదర్శకాలు ఇవీ..

పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు అర్హులు కారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు కూడా దరఖాస్తుకు అర్హత కలిగి ఉంటారు. గతంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది ఉండాలి. డైట్ లెక్చరర్లు, మండల విద్యాశాఖాధికారులు, ఇతర తనిఖీ అధికారులు దరఖాస్తుకు అనర్హులు. అర్హులైన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వారి దరఖాస్తులను ఎంఈవోలకు సమర్పించాలి. డివిజన్ల స్థాయిలో డీవైఈవోతో కూడిన కమిటీ పరిశీలన చేస్తుంది. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ప్రతిపాదన చేసే ఉపాధ్యాయులకు సంబంధించి పదిలైన్లకు మించకుండా పరిశీలనాధికారి రాయాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో మోసాలు

- అమలాపురంలో ఐదుగురు నిందితుల అరెస్ట్
- వీరి నుంచి 5 ల్యాప్‌టాప్‌లు, 75 స్మార్ట్ ఫోన్లు, బ్యాంక్‌బుక్‌లు, ఏటీఎం కార్డుల స్వాధీనం
- భీమవరానికి చెందిన ఇద్దరు సూత్రధారుల కోసం గాలింపు


స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్లు, సిమ్ కార్డులు, ఏటీఎం కార్డులతో సీఐలు క్రిస్టోఫర్, అబ్దుల్ సలామ్, క్రైమ్ పోలీసులు

అమలాపురం టౌన్: ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో క్రికెట్ తదితర గేమ్‌ల పేరుతో మోసం చేస్తున్న ఓ ముఠాను అమలాపురం పట్టణ పోలీసులు ఆకస్మిక దాడితో పట్టుకున్నారు. అమలాపురం పట్టణం ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద ఉన్న ఓ లాడ్జిలో ఐదుగురు వ్యక్తులు ఆన్‌లైన్ బెట్టింగులతో ఫోన్లు, మెసేజ్‌ల ద్వారా పలువురి బ్యాంక్ ఖాతాదారులకు వల పన్నుతున్న సమయంలో పట్టణ సీఐ కె.క్రిస్టోఫర్, క్రైమ్ సీఐ అబ్దుల్ సలామ్‌ల ఆధ్వర్యంలో క్రైమ్ పోలీసుల బృందం సోమవారం మధ్యాహ్నం మాటు వేసి ఆ ముఠాలోని ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించింది. తీగ లాగితే డొంక కదిలినట్లు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన ఇద్దరి కీలక వ్యక్తుల ఆధ్వర్యంలో ఈ ముఠా నడుస్తోందని దర్యాప్తులో గుర్తించారు. అదుపులోకి తీసుకున్న ఐదుగురు నిందితులను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అజ్ఞాతంలో ఉన్న ఇద్దరి కీలక సూత్రధారుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. లాడ్జిలో పట్టుబడ్డ ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా సభ్యులైన ఐదుగురు నిందితులు అమలాపురం రూరల్ మండలం భట్లపాలేనికి చెందిన మోటూరి దొర సత్య సూర్య మణికంఠ, మోటూరి మధు పవన్, కృష్ణా జిల్లా కైకలూరు మసీద్ రోడ్డుకు చెందిన భలే ప్రవీణ్ బాబు, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన పంజా సాయి నరసింహ, గురజాపు సూర్య ప్రభులను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు పట్టణ సీఐ క్రిస్టోఫర్ తెలిపారు.

వీరి వద్ద నుంచి ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న అయిదు ల్యాప్ టాప్‌లు, 75 స్మార్ట్ ఫోన్లు, 15 సిమ్ కార్డులు, 19 బ్యాంక్ బుక్‌లు, 25 ఏటీఎం కార్డులు, 7 నోట్ బుక్‌లు, ఒక వైఫై రూటర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పోలీసులు దాడి చేస్తున్న సమయంలో ఈ ముఠా ఆన్‌లైన్ ద్వారా పలువురిని మోసం చేసే ప్రక్రియలో ఉందని తెలిపారు. సూత్రధారులైన ఇద్దరూ కూడా పట్టుబడితే ఈ ముఠా ఆన్‌లైన్ గేమ్‌ల మోసాలు మరింత వెలుగు చూస్తాయన్నారు. స్వాధీనం చేసుకున్న 75 స్మార్ట్ ఫోన్లలో గూగుల్ ప్లే స్టోర్‌లోని కొన్ని యాప్‌లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ యాప్‌ల ద్వారా పలువురి వాట్సాప్ లింక్ ఆధారంగా వారి గ్రూపుల్లోకి ప్రవేశించి బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఈ యాప్‌లను తక్షణమే తొలగించాలని, బాధ్యులపై అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గూగుల్ సంస్థకు లేఖ రాసినట్లు సీఐ క్రిస్టోఫర్ తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాను చాకచక్యంగా పట్టుకోవడంతో క్రైమ్ ఏఎస్సై అయితాబత్తుల బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు రాజు, రమణ, కానిస్టేబుళ్లు ప్రసాద్, సాయి, హరి, ప్రసాద్ చొరవ చూపారు. పట్టణ పోలీసులు, క్రైమ్ పోలీసులను జిల్లా ఎస్పీ కార్యాలయం అభినందించింది.